క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల అద్దె తగ్గింపు

నర్సంపేట : శుభకార్యాలయ, తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సును తగ్గించిన ధరకు అద్దెకు ఇవ్వనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, దైవ దర్శనాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులను ప్రజలు అద్దెకు తీసుకుని అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల అద్దెను 15–20 శాతం తగ్గించినట్లు వివరించారు. బస్సులను బుక్ చేసుకునేందుకు సెల్ నంబర్ 9959226052, 8919313229, 9989038476ల్లో సంప్రదించాలని కోరారు.

నియామకం



గీసుకొండ : తెలంగాణ నాటక సమాఖ్య గౌరవ సలహాదారుగా నాటక రంగంలో 60 ఏళ్ల అనుభవం ఉన్న మారడోజు సదానంద చారిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం ప్రకటించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమాఖ్య కోర్ కమిటీ సమావేశంలో సదానంద చారి నియామకాన్ని సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన సమాఖ్య ప్రతినిధులకు సదానందచారి కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక మునిసిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్‌కుమార్‌ను కార్యాలయంలో మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) నాయకులు మిద్దెపాక రవీందర్, జన్ను రాములు, మారెపల్లి ఎల్లయ్య శనివారం కలిసి పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



దుగ్గొండి : ఈనెల 21న తలపెట్టిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను మండంలోని గిర్నిబావిలో జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్థులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి జెండా ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, ఎస్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నాయకులు జినుకుల కొమ్మాలు, నీరటి సదానందం, పోలు అమర్‌చంద్, మహిళా విభాగం అధ్యక్షురాలు గోనెల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : మండలంలోని చలపర్తికి చెందిన జీపు డ్రైవర్ కుంటమల్ల గణేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన సతీమణి స్వప్నకు ఓల్డ్ జీప్ ఓనర్స్ అండ్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.34 వేల 400 సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్ మాట్లాడారు. గణేశ్ మృతి బాధాకరమన్నారు. గణేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి అసోసియేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగిశెట్టి ప్రవీణ్, వర్రంకి వేణు, తాళ్లపెల్లి స్వామి, నామోజు కేదారి, పస్తం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నెక్కొండ : అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని అమీన్‌పేట మాజీ సర్పంచ్ రామక్క (70) శనివారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్‌గా రామక్క అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గరికపాటి హన్మంతరావు, యాకయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు డెక్క సాంబరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణానికి చెందిన నిమ్మాని సోమేశ్వర్‌రావు ద్విచక్ర వాహనంపై డీసీ తండా వెళ్లి తిరిగి వస్తుండగా వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై పశువుల ఆస్పత్రి సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సోమేశ్వర్‌రావు కాలు విరిగింది. ఆయన్ను స్థానికులు 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

చెన్నారావుపేట : ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ కోరారు. మండలంలోని ఎల్లాయగూడెం, చెరువుకొమ్ము తండాలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, కులగణన సర్వేను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సర్వేను తగు జాగ్రత్తలతో నిర్వహించాలని సూచించారు. సమాచారం సేకరించడంలో ప్రజల సహకారం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అంబటి శ్రీధర్ రాజు, పంచాయతీ కార్యదర్శి అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : సర్వేను పరిశీలిస్తున్న బాలకృష్ణ

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ, నారాయణపురం, పర్వతగిరి, ఏబీ తండా, దౌలత్‌నగర్, ఇస్లావత్ తండా గ్రామాల్లో సర్వేను ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ పర్యవేక్షించారు. ఫారాలను పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు అందించారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా, సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల్ కుమార్, పీఆర్ ఏఈ కవిత, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న సతీశ్ నారాయణ

సంగెం : ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని రామ్‌చరణ్ ఆయిల్ ఇండ్రస్ట్రీస్ జనరల్ మేనేజర్ సతీశ్ నారాయణ అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో పోశాల చంద్రశేఖర్ ఆయిల్ పామ్ క్షేత్రంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో జీఎం సతీశ్ మాట్లాడారు. ప్రపంచంలో ఆయిల్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి కావడం లేదన్నారు. ఎంత ఉత్పత్తి చేసినా అంతకు మించిన డిమాండ్ ఉంటోందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. దేశ ప్రజల అవసరాల మేరకు ఉత్పత్తి జరగకపోవడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై మొక్కలు అందిస్తోందని తెలిపారు. నాటిన మూడేళ్ల వరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చని, అందు కోసం ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధికారి అనిల్, కోఆర్డినేటర్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



దివ్య పడిపూజ చేస్తున్న అర్చకుడు దేవేశ్ మిశ్రా, అర్చకులు

నర్సంపేట : శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకుడు దేవేశ్ మిశ్రా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం చేశారు. ఓదెల సాంబయ్య సుభద్ర, సందీప్, చెరుకూరి రాజమౌళి సునీత, లక్ష్మీప్రసాద్, బైరి విఠల్ వసంత, ప్రసన్న కుమార్, తేజస్విని, ప్రశాంత్, గొడిశాల భిక్షపతి సరోజన, కిరణ్‌కుమార్ స్వాతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతులు వెలిగించి మాలధారులకు అన్నదానం చేశారు. అర్చకుడు దేవేశ్ మిశ్రా శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం, పుష్పాభిషేకం, దివ్య పడిపూజ నిర్వహించారు. దివ్య పడిపూజకు దాతలుగా చింతల నిరంజన్, అక్షయ్, ప్రత్యూష చందన్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మినారాయణ, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, గురుస్వాములు దేశీరాం, శ్రీధర్, మర్రి రాజ పాల్గొన్నారు.

ఇద్దరిపై అట్రాసిటి కేసు

చెన్నారావుపేట : ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు నెక్కొండ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొందరు రైతులకు నో డ్యూ సర్టిఫికెట్లు అందజేసిన విషయంలో వైస్ చైర్మన్ చింతకింది వంశీ, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్ కులం పేరుతో తనను దూషించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దొంగల అరెస్ట్

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలో ఆటో టైర్లు, బ్యాటరీలు, డెక్కులు చోరీ చేస్తున్న ఆడెపు సాంబశివరావు, కొంపల్లి రితిక్, రాగి నాగులు దొంగలను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. పోలీసు సిబ్బంది దొంగల కోసం గాలించి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సుజన్ ప్రసాద్

పర్వతగిరి : విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు వరంగంటి సంపత్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి సుజన్ ప్రసాద్ అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, విద్యారంగ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ మాట్లాడుతూ కులగణన సర్వే సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. ఒంటి పూట బడులతో ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాద ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి పాక శ్రీనివాస్ మాట్లాడుతూ తక్షణమే పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు వరంగంటి సంపత్, ఉపాధ్యక్షులుగా వరప్రసాద్, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా అరవింద్ కుమార్, కోశాధికారిగా రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శులు చంద్రభాను రాజు, రజిత, సునీత, సాంబరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గుండు కరుణాకర్, మోడల్ స్కూల్స్ కన్వీనర్ నారా శ్రీనివాస్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం



జెండా వందనం చేస్తున్న చైర్మన్, తదితరులు

చెన్నారావుపేట : రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి తెలిపారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పీఏ సీఎస్‌లో శనివారం ఆయన జెండా ఎగరేసి మాట్లాడారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఇతరత్రా సేవలు అందించేందుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చింతకింది వంశీ, డైరెక్టర్లు జంగిలి బాబు, మజ్జిగ రాంబాబు, శంకర్, రమాదేవి మహేందర్ రెడ్డి, మంజుల నారాయణరెడ్డి, మహ్మద్ బషీర్, కవిత, ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ కాంత్, రాంరెడ్డి, సీఈఓ చిట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట నర్సంపేట ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కన్నం సందీప్‌కు దొరకడంతో బాధితుడికి పోలీసుల సమక్షంలో శనివారం అప్పగించారు. సందీప్‌కు సెల్‌ఫోన్ దొరకడంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. దీంతో పోలీసులు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తిని పిలిపించి సెల్ ఫోన్ అప్పగించారు. సందీప్‌ను స్థానికులు అభినందించారు.

గంగదేవిపల్లిలో విద్యార్థుల అధ్యయనం



గంగదేవిపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

గీసుకొండ : జాతీయ స్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన మండలంలోని గంగదేవిపల్లిని నర్సంపేట మండలంలోని మహేశ్వరం గీతాంజలి గ్లోబల్ (శివానీ) పబ్లిక్ స్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు శనివారం సందర్శించారు. గ్రామంలోని అభివృద్ధిని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి విద్యార్థులకు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులు విజయవంతం అయ్యాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వివరించారు. ఐక్యత, ప్రణాళికతోనే ఏదైనా సాధించగలమని విద్యార్థులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, రహీముద్దీన్, టి.రాజు, మురళి, కవిత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

రాయపర్తి: కార్మికుల హక్కుల సాధనే ఏఐటీయూసీ లక్ష్యమని జిల్లా నాయకులు ప్రసాద్, శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని శివరామపురంలో శనివారం నిర్వహించిన మహాసభలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని స్పష్టం చేశారు. తొలుత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు.

అండగా ఉంటా : శ్రీనివాస్‌రెడ్డి

కార్మికులకు అండగా ఉంటానని ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత, బీఆర్ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఏఐటీయూసీ మహాసభ సందర్భంగా ఆ సంఘం గద్దె ఆవిష్కరణ, ర్యాలీ, సభకు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులు శ్రమకు తగ్గ ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. కార్మికులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. తొలుత రూ.10 వేల విలువైన కాంటాను బహూకరించారు. మహాసభలో సంఘం మండల అధ్యక్షుడు గబ్బెట కొమురయ్య, ప్రధాన కార్యదర్శి చెడుపాక యాకయ్య, ఉపాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘గిరిజనుల భూములు లాక్కోవడం తగదు’

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరుతో భూములు లాక్కోవడం సరికాదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసూనాయక్ అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం లంబాడీల నుంచి భూములను లాక్కుని కేసులు నమోదు చేసి జైలు పాల్జేయడం దారుణమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని, తండాల నుంచి పోలీసుల శిబిరాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జాటోతు తిరుపతి, భూక్య జగన్, బోడ మురళి, రవి, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై చందర్

వర్ధన్నపేట : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ఎస్సైలు చందర్, రాజు ఆకాంక్షించారు. పట్టణంలోని ఫుస్కోస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 27వ జాతీయ జెండాతోపాటు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి వార్షిక క్రీడా పోటీలను వారు శనివారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి బాటలు వేస్తాయన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఇతర రంగాల్లోనూ నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. తొలుత విద్యార్థులు మార్చ్ పాస్ట్ నిర్వహించగా ఎస్సైలు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, స్కూల్ కరస్పాండెంట్ మేరీ ఆంటోని, హెచ్ఎం డైసీ మాల, సిస్టర్ జెనీసర్ వలస, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నర్సంపేట : విద్యార్థులకు బకాయి ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ సోల్తి సారయ్య, డివిజన్ అధ్యక్షుడు నీలారపు నరేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి మల్లేషం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి శనివారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు గండు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, పట్టణ ఉపాధ్యక్షుడు చీర వెంకట్‌నారాయణ, బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు పంజాల వెంకట్, ఖానాపురం మండల అధ్యక్షుడు ముద్దంగుల సంపత్, నాయకులు గోపగాని వెంకట్, సాంబయ్య, సోల్తి అనిల్, నాగరాజు, మనోహర్, సోల్తి మధు, ఉర్గుల రాజు పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల అందజేత



రాయపర్తి : మండలంలోని చక్రుతండాకు చెందిన బాదావత్ బిచ్చ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి శనివారం బియ్యం, నూనె, ఇతర సరుకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అపర్ణ

పర్వతగిరి : జీవితంలో విద్యార్థి దశ కీలకమని గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం చిల్డ్రన్స్ డే వేడుక నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలు, నాటికలతో అలరించగా ప్రతిభావంతులతోపాటు టెస్ట్ టాపర్స్‌కు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడారు. విద్యార్థులు చదువుకోవడంతోపాటు సోషల్ యాక్టివిటీస్‌లోనూ ముందుండాలని చెప్పారు. చదువే జీవితంలో వెలుగులు నింపుతుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులందరూ 10/10 జీపీఏ సాధించాలని సూచించారు. గురుకుల స్కూల్ చదువుకున్న అనేక మంది ఉన్నత స్థాయిలో ఉన్నారని వివరించారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టండి

సంగెం : ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడంతో 80 శాతం పోస్టులు మాల కులస్తులకు దక్కి మాదిగ పేదలు నష్టపోయారని ఆందోళన వెలిబుచ్చారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామెర కిశోర్, ఉపాధ్యక్షులుగా కలకోట్ల యాకాంబ్రం, బాషిపాక రాములు, కట్ల అశోక్, పరికి ఏసోబు, ప్రధాన కార్యదర్శిగా కోడూరి రాజు, కార్యదర్శిగా సదిరం అశోక్, బర్ల మహేశ్, ప్రచార కార్యదర్శిగా కొలకనూరి రవీందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, బిర్రు మహేందర్, తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్, గుండేటి బాబు, ఏలియా, రవి, నారాయణ, సునీల్ పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత మల్లయ్య, చక్రుతండాకు చెందిన బాధావత్ బిచ్చ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నయీమ్, నాయకులు నర్సయ్య, మచ్చ సత్యం, బల్లెం యాదగిరి, సింహాద్రి, చందు సతీశ్, ఐత రవి, పీరని రవీందర్, ఐత జంపి, యాకూబ్, నరేశ్, యాకయ్య, భోజ్యా నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గీసుకొండ : మండలంలోని ఆరెపల్లికి చెందిన తుమ్మనపెల్లి శంకర్‌రావు (65) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్‌రావు కుమారుడైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్, కాంగ్రెస్ నాయకులు భీమగాని సౌజన్య, చాడ కొమురారెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, దుకిరె రమేశ్, తదితరులు శంకర్‌రావు మృతదేహానికి నివాళులర్పించి శ్రీనివాస్‌ను పరామర్శించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

నల్లబెల్లి : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శనిగరంలో శనివారం నిర్వహించిన ఏరియా మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో కార్మికులకు నష్టం కలిగించేలా చట్టాలను అమలు చేస్తోందని విమర్శించారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా ఏర్పాటు చేసిందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు సూచించారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఈర్ల రాజు, మనగాని ప్రశాంత్, కోమండ్ల రమేశ్, వైనాల రవి, జన్ను రవి, రమేశ్, మధుకర్, లింగన్న, భద్రు, పట్టల దేవేందర్, తాళ్లపల్లి రవి, రాజు, భిక్షపతి, అనిల్, రాజన్న, ఐలమ్మ, ఉపేంద్ర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఫలితాలు ఖాయం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సుబ్బారావు

ఖానాపురం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఫలితాలు ఖాయమని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు తెలిపారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు రూ.15 వేల విలువైన పుస్తకాలను శనివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికాయుతంగా చదవాలని సూచించారు. వ్యసనాలకు, సెల్‌ఫోన్ లాంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా చదవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజేందర్, రాజేంద్రప్రసాద్, వసీమ్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.